సాక్షి కర్నూలు

ఆదివారం । 5 । మార్చి । 2023



శనగల బసవన్నకు పూజలు

శ్రీశైలంటెంపుల్: క్షేత్రంలో శనగల బసవన్నగా పేరుపొందిన నందీశ్వరునికి శనివారం సాయంత్రం పంచామృతాలతో అభిషేకాది అర్చనలను నిర్వహించారు.



రమణీయం.. రథోత్సవం

ఆలూరు: దేవనకొండ మండలం తెర్నేకల్ గ్రామంలో శ్రీ లక్ష్మి మాధవస్వామి రథోత్సవం శనివారం సాయంత్రం రమణీయంగా సాగింది. భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు.

ఉష్ణోగ్రతలు

గరిష్టం	37.3
కనిష్టం	20.4

న్యూస్‌రీల్

పోస్టల్ బ్యాలెట్‌కు ఫారం-12 తప్పనిసరి

కర్నూలు(అర్బన్): ఎమ్మెల్సీ ఎన్నికల విధుల్లోని ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఫారం-12లో దరఖాస్తు చేసుకోవాలని ఎమ్మెల్సీ ఎన్నికల నోడల్ అధికారి టి.నాగరాజు నాయుడు తెలిపారు. ఈ మేరకు జిల్లా జాయింట్ కలెక్టర్ రామసుందర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఫారం-12 దరఖాస్తుతో పాటు ఎన్నికల విధుల ప్రొసీడింగ్స్ కాపీ జత చేయాలన్నారు. దరఖాస్తులను ఈ నెల 6వ తేదీ సాయంత్రం 5గంటల్లోపు కలెక్టరేట్ ఆవరణలోని జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయంలో అందజేయాలని కోరారు.

సహాయకుల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు(సెంట్రల్): స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు వ్యక్తిగత ఇబ్బందులు ఉంటే సహాయకుల నియామకానికి దరఖాస్తు చేసుకోవాలని రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి శనివారం ఓ ప్రకటనలో కోరారు. అంధత్వం, నిరక్షరాస్యులు, అనారోగ్యంతో బాధపడే వారు తగిన ఆధారాలను చూపి సహాయకులను నియమించుకోవచ్చన్నారు. ఈనెల 10వ తేదీన ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల్లోపు తగిన ఆధారాలతో స్వయంగా రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో దరఖాస్తులను సమర్పించాలన్నారు. సహాయకుడి వయసు కచ్చితంగా 18 ఏళ్లు నిండి ఉండి ఆయన ఫొటో గుర్తింపు కార్డును సమర్పించాలని పేర్కొన్నారు.

వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యం



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ రంగారెడ్డి

గోనెగండ్ల: పదో తరగతి విద్యార్థులు ప్రతి ఒక్కరూ పాస్ అయ్యే విధంగా వంద శాతం ఫలితాలు సాధించడంపై ఉపాధ్యాయులు దృష్టి సారించాలని డీఈఓ రంగారెడ్డి సూచించారు. శనివారం గోనెగండ్ల కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను ఆయన సందర్శించారు. పదో తరగతి విద్యార్థుల నైపుణ్యాలను పరిశీలించారు. పరీక్షల సమయంలో కొంత భయం, ఆందోళన ఉండడం సహజమని, ఒత్తిడిని అధిగమించేలా ఉపాధ్యాయులు విద్యార్థులకు ప్రత్యేకంగా పాఠాలు బోధిస్తున్నారని తెలిపారు. కొంచెం కష్ట పడితే మంచి మార్కులు సాధించడం చాలా సులువు అన్నారు. కార్యక్రమంలో ఉర్దూ ఏఎంఓ ఆడం బాషా, ఎంఈఓ వినోద్‌కుమార్, పాఠశాల ఎస్‌ఓ విద్యావతి, సీఆర్పీ రవి పాల్గొన్నారు.

17న ఆన్‌లైన్‌లో వాహనాల వేలం

కర్నూలు: జిల్లా పోలీసు విభాగానికి చెందిన కాలం చెల్లిన 39 వాహనాలకు ఈనెల 17వ తేదీన ఆన్‌లైన్‌లో వేలం వేయనున్నారు. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయం నుంచి శనివారం ఒక ప్రకటన విడుదలైంది. ఆసక్తి ఉన్నవారు https://konugolu.ap.gov.in అనే వెబ్‌సైట్‌లో బిడ్డింగ్ వేయాల్సి ఉంటుంది. వాహనాలు కర్నూలు మండలం దిన్నెదేవరపాడు గ్రామ శివారులోని జగన్నాథగట్టుపై ఉన్న పోలీసు శిక్షణ కేంద్రంలో ఉన్నాయి. ఆసక్తి కలిగినవారు అక్కడికి వెళ్లి చూసుకోవచ్చు. వివరాలకు 9121101053 (ఎంటీఓ ఆర్‌ఐ రమణ) 9908628390 (రైటర్) నంబర్లను సంప్రదించవచ్చు.

పునఃమూల్యాంకనంలో 498 మంది ఉత్తీర్ణత

కర్నూలు సిటీ: బీఈడీ ఫస్ట్ సెమిస్టర్ పునఃమూల్యాంకనంలో 498 మంది ఉత్తీర్ణ సాధించినట్లు రాయలసీమ యూనివర్సిటీ పరీక్షల విభాగం డీన్ విశ్వనాథరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గతేడాది ఆగస్టు నెలలో పరీక్షలు నిర్వహించామని, ఫలితాల అనంతరం పునఃమూల్యాంకనానికి 1,121మంది ఛాత్రోపాధ్యాయులు దరఖాస్తు చేసుకున్నారని పేర్కొన్నారు. శనివారం ఫలితాలు విడుదల చేసినట్లు తెలిపారు.



'సెల్'లో మనిషి బందీ

- 'స్మార్ట్'ఫోన్ల విచ్చలవిడి వినియోగం
- ఒక్క క్షణం కనిపించకపోయినా ఆందోళన
- ఏ పనికైనా వీటిపైనే ఆధారం
- దైనందిన జీవితంలో పెనుమార్పులు
- అతి వినియోగంతో పొంచిన ముప్పు

సండే స్పెషల్

జీవితంలో భాగమై.. జీవనం దుర్భరమై!

'స్మార్ట్‌ఫోన్'.. ప్రస్తుతం ప్రపంచాన్ని శాసిస్తోంది. కొన్ని గంటల పాటు ఫోన్లు పనిచేయకపోయినా జనజీవనం స్తంభిస్తుంది. కేవలం కమ్యూనికేషన్ కోసం రూపొందించిన ఈ సాధనం ఇప్పుడు మనిషి జీవనంలో భాగమైపోయింది. ప్రతీ విషయంలో ఫోన్ లేకపోతే రోజు గడవని పరిస్థితి నెలకొంది. ఒకరకంగా వీటివల్ల జీవనం సులభతరమైనా.. అతి వినియోగం అనర్థాలకు కారణమవుతోంది. ఒక్క మాటలో చెప్పాలంటే మనిషి 'సెల్'లో బందీ.

– సాక్షి ప్రతినిధి కర్నూలు



మూడు దశాబ్దాలుగా 'స్మార్ట్ ప్రపంచం' మనిషిని ఆడిస్తోంది. చేతిలో ఫోన్ ఉంటే ప్రపంచం గుప్పిట్లో ఉన్నట్లే. 79శాతం ఇళ్లలో ఒకటి కంటే ఎక్కువ ఫోన్లు అత్యంత సహజం. ఆత్మీయతలు, అనుబంధాలను దూరం చేస్తున్న ఈ ఫోన్.. ప్రపంచాన్ని మాత్రం అరచేతిలోకి తీసుకొచ్చింది. డబ్బు, సమయం ఆదా అన్న మాటే కానీ.. చాలా విషయాల్లో దూరం పెంచుతోంది. జీవన వేగం పెరిగినా.. సౌలభ్యంతో సంతోషం కలుగుతున్నా.. ఏదో తెలియని వెలితి ఆందోళన కలిగిస్తోంది. చాలా కంపెనీలు, వ్యాపార సంస్థలు వివిధ రకాల అప్లికేషన్లు, యాప్స్‌ను రూపొందించడంతో సెల్‌ఫోన్ వినియోగం అధికమైంది. ఉద్యోగుల హాజరు, దరఖాస్తులు, ఈకేవైసీతో పాటు ప్రతీ అంశంలో ఫోన్ మనిషి జీవనంలో భాగమైంది. ప్రత్యక్షంగా, పరోక్షంగా దేశాల ఆర్థిక ఎదుగుదలకు కూడా 'స్మార్ట్ ఫోన్లు' ఉపయోగపడుతుండటం విశేషం.

'స్మార్ట్'తో జీవన వేగం

పదేళ్ల కిందటి వరకు నగదు లావాదేవీల కోసం బ్యాంకులకు వెళ్లి గంటల తరబడి వేచి, దరఖాస్తులు పూర్తి చేసే పరిస్థితి. ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎం వచ్చాక క్షణాల్లో 'మనీ ట్రాన్స్‌ఫర్' జరుగుతోంది. సినిమా టిక్కెట్లు, ఇన్సూరెన్స్, గ్యాస్‌తో పాటు అన్ని రకాల బిల్లుల చెల్లింపులు 'స్మార్ట్'గా చేస్తున్నారు. ఫోన్‌లో ఆడియోతో పాటు ఫేస్ టు ఫేస్ వీడియో కాల్స్ మాట్లాడుతున్నారు. ఫొటోలు, వీడియోలు షేర్ చేస్తున్నారు. మెయిల్స్ ద్వారా డాక్యుమెంట్స్ షేర్ చేస్తున్నారు. దీంతో చాలా సమయం ఆదా అవుతోంది. పనులు త్వరగా పూర్తవుతున్నాయి. లక్ష్యాలను సులభంగా, వేగంగా చేరుకోగలుగుతున్నారు. వీటితో పాటు ఎంటర్‌టైన్‌మెంట్‌గా కూడా ఫోన్ ఉపయోగపడుతోంది. ఇంటర్‌నెట్ వినియోగం పెరగడంతో సినిమాలు, టీవీ షోలు, సంగీతాన్ని ఆస్వాదిస్తున్నారు. ఫేస్‌బుక్, ట్విట్టర్, వాట్సాప్, ఇన్‌స్టాగామ్‌తో పాటు పలు రకాల న్యూస్, ఎంటర్‌టైన్‌మెంట్ యాప్స్ చూస్తున్నారు. ఆన్‌లైన్ క్లాసులు, రోజువారీ అసైన్‌మెంట్‌లతో పాటు ప్రోగ్రెస్ రిపోర్టులు కూడా స్కూళ్లు తల్లిదండ్రుల ఫోన్‌లకు పంపిస్తున్నారు.

అమెరికన్ లైఫ్ ప్రాజెక్టు రీసెర్చ్ సెంటర్ సర్వేలో వెల్లడైన వాస్తవాలు



- 2019తో పోల్చితే స్మార్ట్ ఫోన్ చూడటం 2020కి 39శాతం పెరిగింది. ఇప్పుడు 51శాతానికి చేరింది.
- ఒక్కసారి ఫోన్ ఆన్ చేస్తే 70శాతం మంది రెండు నిమిషాలు నాన్‌స్టాప్‌గా ఆపరేట్ చేస్తున్నారు.
- 25 శాతం మంది 2–10 నిమిషాలు విరామం లేకుండా చూస్తున్నారు.
- 5శాతం మంది 10 నిమిషాలకు పైబడి చూస్తున్నారు.
- ఒక్కొక్కరు రోజుకు సగటున ఫోన్‌ను 58సార్లు చూస్తున్నారు.
- సగటున ఒక్కొక్కరు రోజూ 3.15 గంటలు ఫోన్ వాడుతున్నారు.
- 84 శాతం మంది వారి డ్యూటీ టైంలో సెల్‌ఫోన్‌ను వాడుతున్నారు.
- 61 శాతం మంది ఫోన్లతో సమయాన్ని వృథా చేస్తున్నారు.

అతి వాడకంతో అనర్థాలూ అధికమే..

'స్మార్ట్‌ఫోన్' ప్రపంచాన్ని మార్చి, సౌకర్యవంతమైన జీవితాన్ని ఇచ్చి అభివృద్ధికి సూచీగా ఎలా మారిందో, అతిగా వినియోగించడం వల్ల అనారోగ్య సమస్యలు తెచ్చిపెడుతోంది. చాలామంది యూజర్లు సోషియల్ మీడియాలో ఎక్కువగా గడుపుతున్నారు. గేమ్స్ ఆడుతున్నారు. ఇవి వారి ఎదుగుదల, సక్సెస్‌పై ప్రభావం చూపుతున్నాయి. సమయం వృథా అవుతోంది. మానసిక సమస్యలు తలెత్తుతున్నాయి. సెల్‌ఫోన్‌కు బానిసలు కావడాన్ని 'నోమోఫోబియా' అంటారు.



66శాతం మంది దీంతో బాధపడుతున్నారు. అయితే ఇదొక వ్యాధి అని, దీంతో బాధపడున్నామనే సంగతి కూడా వారికి తెలీదు. వీరంతా నిజమైన ప్రపంచం, జీవనానికి దూరమవుతున్నారు. 'స్మార్ట్‌ఫోనే' జీవితంగా గడుపుతున్నారు. బయట ఉన్నా, బంధువులతో ఉన్నా వారి దృష్టి, చూపు ఫోన్‌పైనే. వాట్సాప్, నోటిఫికేషన్లు, వీడియో, ఫొటోలు షేరింగ్, మేసేజ్‌లు పంపుతూ గడుపుతున్నారు. రోడ్లపై నెమ్మదిగా నడిచి వెళ్లేవారి వారి కళ్లు, చేతులు ఫోన్‌పైనే ఉంటున్నాయి. ఇవి రోడ్డు భద్రతపై ప్రభావం చూపుతున్నాయి. ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ఎక్కువగా ఫోన్ చూసేవారిలో కంటిచూపు, వెన్ను, నరాల సమస్యలతో పాటు సైకాలజికల్, న్యూరాలజీ సమస్యలు కూడా ఉత్పన్నమవుతున్నాయి.

అవసరానికి మించి వాడితే అవస్థలే



'స్మార్ట్‌ఫోన్' లేకపోతే గంట కూడా ఉండలేని పరిస్థితి నెలకొంది. చిన్నపిల్లోడు అన్నం తినాలన్నా యూట్యూబ్ తప్పనిసరి అయ్యింది. రాత్రిళ్లు ఫోన్ చూడటంతో 'స్క్రీన్ లైటింగ్' పడుతుంది. దీంతో 'మెలటోన్' అనే హార్మోన్ విడుదల కాదు. ఫలితంగా నిద్రలేమి, మైగ్రేన్ సమస్యలు వస్తున్నాయి. అవసరానికి మాత్రమే ఫోన్ వాడాలి. లేదంటే అవస్థలు తప్పవు.

– డాక్టర్ శ్రీనివాసులు, న్యూరాలజీ విభాగాధిపతి, కర్నూలు జనరల్ ఆస్పత్రి

అవసరం మేరకే వినియోగించాలి



ఇప్పుడంతా స్మార్ట్‌ఫోన్ల కాలం. అయితే అవసరం మేరకు మాత్రమే ఫోన్లను వినియోగించాలి. చిన్న పిల్లలు మొదలుకొని ముసలివాళ్ల వరకు చేతిలో ఫోన్ లేకపోతే ఏదో కోల్పోయినట్లుగా భావిస్తున్నారు. ఈ పరిస్థితిలో మార్పు రావాలి. ప్రతి ఒక్కరూ కొంత సమయం ఫోన్ వాడకుండా ఉండేందుకు యత్నించాలి. కుటుంబ సభ్యులంతా కూర్చొని మాట్లాడుకోవడం, కలిసి భోజనం చేస్తూ.. ఫోన్లను దూరంగా ఉంచాలి.

– కె.స్వాతి, ఇంగ్లిష్ ప్రొఫెసర్, కర్నూలు



పెళ్లి పీటలపై కొలువైన జ్వాలానరసింహుడు, చెంచులక్ష్మీ అమ్మవారు



కల్యాణ మహోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు

కల్యాణం.. కమనీయం

ఆళ్లగడ్డ: వేద పండితుల వేద మంత్రోచ్చారణలు హోరెత్తగా.. భక్తుల గోవింద నామస్మరణ మారుమోగగా.. అహోబిలేశుడి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎగువ అహోబిలంలో ప్రధాన ఘట్టమైన శ్రీ జ్వాలా నరసింహస్వామి, చెంచులక్ష్మి అమ్మవార్ల తిరు కల్యాణోత్సవం కనులపండవగా సాగింది. ముందుగా అహోబిలం మఠం పీఠాధిపతి శ్రీమన్ శఠకోప రంగనాథ యతీంద్ర మహాదేశికన్ ఆధ్వర్యంలో స్వామి అమ్మవార్ల ఉత్సవ మూర్తులకు శాస్త్రోక్తంగా ఎదురుకోళ్ల కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మంగళవాయిద్యాలతో ఊరేగింపుగా కల్యాణ మండపానికి తోడ్కొని వచ్చి కొలువుంచి స్వామి, అమ్మవారికి కంకణధారణ నిర్వహించారు. అనంతరం భక్తుల గోవింద నామస్మరణ మధ్య మాంగళ్యధారణ జరిగింది. చివరగా స్వామి, అమ్మవార్ల పాదాల వద్ద ముత్యాల తలంబ్రాలు పోసి కల్యాణ మహోత్సవాన్ని ముగించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏడో రోజు శనివారం దిగువ అహోబిలంలో శ్రీ ప్రహ్లాదవరదస్వామి వేణుగోపాల స్వామి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి పొన్నచెట్టు వాహనంపై విహరించారు.

పకడ్బందీగా ఇంటర్ పరీక్షలు



మాట్లాడుతున్న కలెక్టర్ పి.కోటేశ్వరరావు

కర్నూలు(సెంట్రల్): మార్చి 15 నుంచి 29వ తేదీ వరకు ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ పి.కోటేశ్వరరావు అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో కలెక్టర్ నేతృత్వంలోని హైపవర్ కమిటీ ఇంటర్ పరీక్షల నిర్వహణపై సమీక్ష నిర్వహించింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 167 జూనియర్ కళాశాలల నుంచి మొదటి సంవత్సరం జనరల్ అభ్యర్థులు 21,748 మంది, ఒకేషనల్ అభ్యర్థులు 1,862 మంది పరీక్షలకు హాజరవుతారన్నారు. రెండో సంవత్సరం నుంచి మొత్తం 26,057మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు చెప్పారు. 73 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని, ఐదు ఫ్లయింగ్ , 12 సిట్టింగ్ స్క్వాడ్‌లను నియమించినట్లు చెప్పారు. పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలతో లైవ్ స్ట్రీమింగ్ ఏర్పాటు చేయాలని ఆర్ఐఓను ఆదేశించారు. అలాగే ప్రతి పరీక్షా కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలు చేయాలన్నారు. విద్యార్థులకు అవసరమైన అన్నిరకాల సదుపాయాలను కల్పించాలన్నారు. సమావేశంలో ఆర్ఐఓ గురవయ్య శెట్టి, డీవీఈఓ జమీర్‌బాషా, డీఈఓ రంగారెడ్డితోపాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు శ్రీశైలంలో 'కామదహనం'

శ్రీశైలంటెంపుల్: ఫాల్గుణ శుద్ధ చతుర్దశి ఘడియలు పురస్కరించుకుని శ్రీశైల మహాక్షేత్రంలో ఆదివారం సాయంత్రం కామదహన కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించనున్నారు. స్వామిఅమ్మవార్ల ఉత్సవ మూర్తులకు పల్లకీ సేవ నిర్వహించి గంగాధర మండపం వద్దకు తోడ్కొని వచ్చి శాస్త్రోక్తంగా పూజలు చేస్తారు. అనంతరం సంప్రదాయాన్ని అనుసరించి గడ్డితో చేసిన మన్మథ రూపాన్ని దహనం చేస్తారు. శివ తపస్సు భంగం చేయగా, కోపించిన పరమశివుడు మన్మధుడిని ఫాల్గుణశుద్ధ చతుర్దశి రోజున దహించినట్లు పురాణాలు చెబుతున్నాయి. కామదహన కార్యక్రమాన్ని వీక్షించడంతో శివకటాక్షం లభిస్తుందని పండితులు చెబుతున్నారు.

మల్బరీ సాగుకు ప్రోత్సాహం



సమావేశంలో మాట్లాడుతున్న పట్టుపరిశ్రమ శాఖ డీడీ పరమేశ్వరి

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు, నంద్యాల జిల్లాల్లో మల్బరీ సాగును ప్రోత్సహిస్తున్నట్లు పట్టు పరిశ్రమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ పరమేశ్వరి తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లోని పట్టుపరిశ్రమ శాఖ కార్యాలయంలో కర్నూలు, నంద్యాల జిల్లా పట్టు పరిశ్రమ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రీయ కృషి వికాస్ యోజన (ఆర్‌కేవీవై) కింద పట్టు రైతులకు సోలార్ లైట్లు, కూలింగ్ ఎక్విప్‌మెంటు, ప్లాస్టిక్ నేత్రికలు, ఫాంపాండ్స్, యాంత్రీకరణ యూనిట్లు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీలకు 90 శాతం, ఇతరులకు 50 శాతం సబ్సిడీ ఉంటుందని పేర్కొన్నారు. ఆర్‌కేవీవై కింద బడ్జెట్ ఉన్నప్పటికీ వినియోగించకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ నెలాఖరులోగా యూనిట్లను గ్రౌండింగ్ చేయాలని ఆదేశించారు. సమావేశంలో సెరికల్చర్ అధికారులు పాల్గొన్నారు.

మహిళా ఉద్యోగులకు స్పెషల్ క్యాజువల్ లీవులు

- 6 నుంచి మూడు రోజులకు అవకాశం

కర్నూలు(అగ్రికల్చర్): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళా ఉద్యోగులకు మూడు రోజుల పాటు స్పెషల్ క్యాజువల్ లీవులు మంజూరు చేస్తూ జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు ఉత్తర్వులు జారీ చేశారని జిల్లా మహిళా ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షురాలు కె.సరస్వతి తెలిపారు. ఈ నెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్స కార్యక్రమాలు జరుగుతాయని, ఈ సందర్భంగా 6, 7 తేదీల్లో ఆటల పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ పోటీలు, మహిళా దినోత్సవ కార్యక్రమాల్లో పాల్గొనే మహిళా ఉద్యోగులు, టీచర్లు తదితరులందరికీ స్పెషల్ క్యాజువల్ లీవులు వర్తిస్తాయని ఆమె శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


మృతి చెందిన కరణం మాధవ్ (ఫైల్)

డోన్ రూరల్: పట్టణ సమీపంలోని కంబాలపాడు సర్కిల్‌లో ఉన్న ఫ్లైఓవర్‌పై శుక్రవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. స్థానిక కొండపేటకు చెందిన కరణం దేవేంద్రుడు కుమారుడు మాధవ్ (23) సొంత పని మీద బైక్‌పై కర్నూలుకు వెళ్లి తిరిగి వస్తుండగా ఫ్లైఓవర్‌పై కర్ణాటకకు చెందిన కంటైనర్ హైదరాబాద్ నుంచి బెంగుళూరు వెళ్తూ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మాధవ్ అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు శనివారం ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించారు. ప్రమాదానికి కారణమైన కంటైనర్ డ్రైవర్ పారిపోగా.. వాహనాన్ని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నగేష్ తెలిపారు.

బైక్‌పై నుంచి కిందపడి..

పగిడ్యాల: ప్రమాదవశాత్తూ బైక్ పైనుంచి కిందపడి ఓ మహిళ మృతి చెందిన ఘటన నెహ్రూనగర్ గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన శివారెడ్డి భార్య ప్రమీలమ్మ(45)కు జగనన్న లే అవుట్ కాలనీలో పక్కా ఇల్లు మంజూరైంది. ఇంటి నిర్మాణ పనుల నిమిత్తం ఉదయం కుమారుడు చెన్నారెడ్డితో కలిసి బైక్‌పై బయలుదేరారు. మార్గమధ్యలో పాఠశాల విద్యార్థులు అడ్డు రావడంతో సడన్ బ్రేక్ వేశాడు. కాగా బైక్ వెనుక కూర్చుకున్న ప్రమీలమ్మ అదుపు తప్పి సిమెంట్ రోడ్డుపై పడటంతో తలకు బలమైన గాయమైంది. వెంటనే నందికొట్కూరు ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స అందించి కర్నూలు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స అందించే లోపే ఆమె మృతి చెందింది.

నాగర్‌కర్నూలు వాసులకు గాయాలు


ప్రమాదంలో దెబ్బతిన్న స్కార్పియో వాహనం

శ్రీశైలంప్రాజెక్ట్: సున్నిపెంట గ్రామానికి రెండు కిలో మీటర్ల దూరంలో ఈద్గా సమీపంలో శనివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు నాగర్‌కర్నూలు వాసులు గాయపడ్డారు. తెలంగాణ రాష్ట్రం నాగర్ కర్నూలు మండలం పెద్దముడియం గ్రామానికి చెందిన ఓ కుటుంబం శ్రీశైలం మల్లికార్జునస్వామి దర్శనార్థం స్కార్పియో వాహనంలో వస్తుండగా ఎదురుగా వస్తున్న కర్నూలు -1 డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొంది. మలుపు వద్ద రెండు వాహనాలు ఎదురెదురు కావడంతో బస్సు వెనుక భాగం స్కార్పియోకు తగలడంతో ఈ ప్రమాదం జరిగింది. స్కార్పియోలో ఉన్న దంపతులు లక్ష్మణస్వామి (59), అరుణ(55)కు గాయాలయ్యాయి. వీరిని 108లో సున్నిపెంట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఏపీ వైపు పారిశ్రామికవేత్తల చూపు

- సీఎం జగన్ పాలనా దక్షతతోనే రూ.13.05 లక్షల కోట్ల పెట్టుబడులు
- విశాఖలో గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ గ్రాండ్ సక్సెస్
- జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి



కర్నూలు(అర్బన్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనా దక్షత, ఆయనపై ఉన్న విశ్వాసంతోనే అనేక మంది పారిశ్రామికవేత్తలు రాష్ట్రం వైపు చూస్తున్నారని జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అన్నారు. విశాఖపట్నం వేదికగా రెండు రోజుల పాటు జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ (జీఐఎస్) విజయవంతమైందని పేర్కొన్నారు. రాష్ట్రంలో రూ.13.05 లక్షల కోట్లు పెట్టుబడి పెట్టేందుకు 352 ఒప్పందాలు కుదిరాయని తెలిపారు. శనివారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడుతూ .. ముఖ్యమంత్రి కాకముందు నుంచి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పారిశ్రామిక రంగంపై అద్భుతమైన అవగాహన ఉందన్నారు. ఆయన అనుభవానికి దేశంలోని ప్రముఖ పారిశ్రామికవేత్తలు కూడా తోడు కానుండడంతో రాష్ట్రంలో ఊహించని రీతిలో అనేక రకాల పరిశ్రమలు రానున్నాయన్నారు. ముఖేష్ అంబానీ, జీఎంఆర్ గ్రూప్స్, అపోలో, నవీన్ జిందాల్ తదితర దిగ్గజ పారిశ్రామిక వేత్తలు స్వయంగా హాజరు కావడం ముఖ్యమంత్రిపై ఉన్న నమ్మకానికి నిదర్శనమన్నారు. ఎనర్జీ, ఐటీ, టూరిజం, అగ్రికల్చర్, అనిమల్ హజ్‌బెండరీ తదితర సెక్టార్లలో పెట్టుబడులు పెట్టి పరిశ్రమలు స్థాపించనున్నారన్నారు. ప్రధానంగా రెన్యూవల్‌బుల్ ఎనర్జీ (సోలార్, హైడల్, విండ్)పై ఎక్కువ ఫోకస్ చేశారన్నారు. దేశంలో ఏ రాష్ట్రానికి ఇవ్వనంత ప్రాధాన్యతను ఆంధ్రప్రదేశ్‌కు ఇస్తున్నారన్నారు. సదస్సు విజయవంతం కావడంలో రాష్ట్ర ఆర్థిక శాఖా మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, పరిశ్రమల శాఖా మంత్రి గుడివాడ అమర్‌నాథ్, విద్యుత్ శాఖా మంత్రి పెద్దిరెడ్డి రాంచంద్రారెడ్డి కృషి ఎంతో ఉందన్నారు.

సైన్యంలో పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

- 7996157222 నెంబర్‌తో హెల్ప్ డెస్కు
- ఆర్మీ రిక్రూట్‌మెంట్ అధికారి కల్నల్ పునీత్ కుమార్


కలెక్టర్ పి.కోటేశ్వరరావుతో సమావేశమైన ఆర్మీ రిక్రూట్‌మెంట్ అధికారి పునీత్ కుమార్

కర్నూలు(సెంట్రల్): భారత సైన్యంలో వివిధ రకాల పోస్టుల భర్తీకి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆర్మీ రిక్రూట్‌మెంట్ అధికారి కల్నల్ పునీత్‌కుమార్ తెలిపారు. ఆర్మీలో మొదటి సారి ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ, పరీక్షల నిర్వహణను చేపట్టామన్నారు. సందేహాల నివృత్తికి 799615722 నెంబర్‌తో హెల్ప్ డెస్కు ఏర్పాటు చేశామన్నారు. శనివారం ఆయన కలెక్టర్ పి.కోటేశ్వరరావును ఆయన కార్యాలయంలో కలసి ఆర్మీ రిక్రూట్‌మెంట్‌కు సహకారం అందించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైన్యంలో టెక్నికల్, నాన్ టెక్నికల్, క్లర్కు, స్టోర్ కీపర్, ట్రేడ్‌మెన్ పోస్టుల భర్తీకి ఫిబ్రవరి 16న నోటిఫికేషన్ వెలువడిందన్నారు. మార్చి 15 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దేశవ్యాప్తంగా 176 ప్రాంతాల్లో ఏప్రిల్ 17 నుంచి ఆన్‌లైన్‌లో ప్రాథమిక పరీక్షలు ఉంటాయని, అభ్యర్థులు తమకు అనువైన ప్రదేశాన్ని కేంద్రాంగా ఎంచుకోవచ్చన్నారు. కార్యక్రమంలో జిల్లా సైనిక సంక్షేమ అధికారి కార్యాలయ సూపరింటెండెంట్ మహేంద్రమ్మ పాల్గొన్నారు.

కుంటలో పడి వ్యక్తి మృతి


మృతి చెందిన పుల్లయ్య

నందికొట్కూరు: రెండు రోజుల క్రితం అదృశ్యమైన వ్యక్తి కుంటలో శవమై తేలాడు. ఎస్‌ఐ ఓబులేసు తెలిపిన వివరాల మేరకు బ్రాహ్మణకొట్కూరుకు చెందిన పుల్లయ్య(47) ఈనెల 2వ తేదీన బహిర్భూమికి వెళ్లి ఇంటికి రాకపోవడంతో పోలీసు స్టేషన్‌లో అతని భార్య నాగరత్నమ్మ ఫిర్యాదు చేసింది. శనివారం అతను కుంటలో శవమై కనిపించాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించగా కాలు జారి కుంటలో పడి చనిపోయినట్లు ఆనవాళ్లు కనిపించాయి. మృతదేహాన్ని నందికొట్కూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

జోయాలుక్కాస్ షోరూం పునః ప్రారంభం


జోయాలుక్కాస్ షోరూమ్‌ను పునఃప్రారంభిస్తున్న మేయర్ బీవై రామయ్య

కర్నూలు (న్యూటౌన్): కర్నూలు గాంధీనగర్ సమీపంలో కొత్తగా అన్ని హంగులతో ఆధునికీకరించిన 'జోయాలుక్కాస్' బంగారు ఆభరణాల షోరూమ్‌ను నగర మేయర్ బీవై రామయ్య శనివారం పునః ప్రారంభించారు. అనంతరం షోరూమ్‌లో బంగారు ఆభరణాలు, డైమండ్ నెక్లెస్‌లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలను ఆకర్షించే విధంగా ఆభరణాలు ఉన్నాయన్నారు. జోయాలుక్కాస్ రిటైల్ డైరెక్టర్ రాజేష్ కృష్ణన్ మాట్లాడుతూ వినియోగదారులకు ప్రత్యేకమైన బహుమతులు అందిస్తున్నామని చెప్పారు. ఆభరణాలపై 25శాతం డిస్కౌంట్‌తో పాటు ఈ నెల 6వ తేదీ వరకు ప్రతి కొనుగోలుపై బహుమతులు అందజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జోయాలుక్కాస్ మార్కెటింగ్ డిప్యూటీ జనరల్ మేనేజర్ అనిష్‌వర్గీష్, బ్రాంచ్ ఇన్‌చార్జ్ లిగేష్, షోరూమ్ సిబ్బంది పాల్గొన్నారు.

'ఉపాధి'లో అక్రమాలను సహించం

- పారదర్శకంగా పనులు చేపట్టాలి
- డ్వామా పీడీ అమరనాథరెడ్డి


ఓపెన్ ఫోరంలో రికార్డులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ అమరనాథరెడ్డి

కర్నూలు(అగ్రికల్చర్): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల్లో అక్రమాలను సహించ లేదని జిల్లా నీటియాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ అమరనాథరెడ్డి అన్నారు. అవినీతి తావులేకుండా పారదర్శకంగా పనులు చేపట్టాలని పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని డ్వామా కార్యాలయంలో ఎమ్మిగనూరు, చిప్పగిరి మండలాలకు సంబంధించి 15వ విడత సోషల్ ఆడిట్‌పై ఓపెన్ ఫోరం నిర్వహించారు. ఎమ్మిగనూరు మండలంలో 2021-22లో లేబర్ కాంపోనెంటు, మెటీరియల్ కింద రూ.6.66 కోట్లు ఖర్చు చేయగా ఇందులో రికవరీ రూ.2.85 లక్షలు మాత్రమే ఉండటం శుభపరిణామమని డ్వామా పీడీ పేర్కొన్నారు. రూ.5.90 లక్షలు సర్దుబాటు(రెటిఫికేషన్) చేసినట్లు తెలిపారు. రూ.37.85 లక్షల నిధుల అభ్యంతరాలను అన్ని కోణాల్లో పరిశీలించి డ్రాప్ చేసినట్లు వివరించారు. నిబంధనలకు విరుద్ధంగా నిధులు ఖర్చు చేసినందున రూ.18,500 జరిమానా విధించినట్లు తెలిపారు. పండ్లతోటల్లో రూ.7.08 లక్షల విలువైన మొక్కలు లేవని, వాటిని నాటించాలని సూచించారు. చిప్పగిరి మండలంలో రూ.5.15 కోట్ల నిధులు వ్యయం చేశారని, ఇందులో రూ.2.25 లక్షల రికవరీ చేసే విధంగా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. రూ.1.83 లక్షలు సర్దుబాటు(రెటిఫికేషన్) చేసినట్లు చెప్పారు. జరిమానా కింద రూ.15,500 విధించినట్లు పేర్కొన్నారు. రూ.5.03 లక్షల విలువ అభ్యంతరాలను డ్రాప్ చేశామని, రూ.1.95 లక్షల విలువ మొక్కలు నాటాల్సి ఉందని వివరించారు. సమావేశంలో డ్వామా విజిలెన్స్ ఆఫీసర్ సిద్ధలింగమూర్తి, వాటర్‌షెడ్ అదనపు పీడీ సలీమ్‌బాషా, ఏపీడీలు, అసిస్టెంటు విజిలెన్స్ ఆఫీసర్ ఫక్కీరప్ప పాల్గొన్నారు.

పెంచిన వడ్డీ రేట్లను సద్వినియోగం చేసుకోండి

- ఎస్‌బీఐ డిపాజిట్ పథకాలపై అత్యధిక వడ్డీరేట్లు


బైక్‌ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్‌బీఐ ఉద్యోగులు

కర్నూలు(అగ్రికల్చర్): భారతీయ స్టేట్ బ్యాంక్ డిపాజిట్‌లపై పెంచిన వడ్డీరేట్లను సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ జనరల్ మేనేజర్ లేఖామీనన్ ఖాతాదారులను కోరారు. వడ్డీ రేట్లపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ శనివారం నగరంలో ఎస్‌బీఐ ఉద్యోగులు బైక్‌ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డీజీఎం మాట్లాడుతూ అమృత్ కళష్ డిపాజిట్ స్కీమ్‌ను 400 రోజులకు ఎస్‌బీఐ అమలు చేస్తోందని.. దీనిపై 7.15 శాతం వడ్డీ వస్తుందన్నారు. సర్వోత్తమ్ డిపాజిట్ స్కీమ్ కింద ఏడాది, రెండేళ్లకు డిపాజిట్ చేయవచ్చని.. సాధారణ ఖాతాదారులకు 7.40 శాతం, సీనియర్ సిటిజన్లకు 7.90 శాతం వడ్డీ వర్తిస్తుందన్నారు. కార్యక్రమంలో చీఫ్ మేనేజర్లు సీవీఆర్ ప్రసాద్, శ్రీనివాస్, జీకేఎన్‌కే చౌదరి, మేనేజర్లు మురళీ, జియాఉర్ రహిమాన్, విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

బాలల న్యాయ చట్టంపై అవగాహన

కర్నూలు(లీగల్): జిల్లా న్యాయ సేవాసదన్‌లో శనివారం బాలల న్యాయ చట్టంపై జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్ల హౌస్ ఆఫీసర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీహెచ్‌వీఎస్.శ్రీనివాసరావు, జువైనల్ జస్టిస్ బోర్డు చైర్మన్ టి.జ్యోత్స్న దేవి, దిశ పోలీస్‌స్టేషన్ డీఎస్పీ బి.వెంకట్రామయ్య, డీటీసీ శ్రీధర్, డాక్టర్ కరీముల్లా తదితరులు మాట్లాడారు. పోలీసు అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ కౌన్సిల్ మనోహర్, బాలల సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్ జుబేదా బేగం పాల్గొన్నారు.

జిల్లా జైలును తనిఖీ చేసిన న్యాయాధికారి

కర్నూలు(లీగల్): పంచలింగాల సమీపంలోని జిల్లా జైలును శనివారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి సీహెచ్‌వీఎస్ శ్రీనివాసరావు తనిఖీ చేశారు. రిమాండ్‌లో ఉన్న ఖైదీల వివరాలను జైలు అధికారి గణేశ్‌నాయక్‌ను అడిగి తెలుసుకున్నారు. వారికి అందిస్తున్న భోజన సదుపాయాలను స్వయంగా పరిశీలించారు. చీఫ్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ ద్వారా ఖైదీలకు అందిస్తున్న ఉచిత న్యాయ సేవల గురించి వివరించారు. 65 సంవత్సరాలు పైబడిన వారి వివరాలు సేకరించారు. ఖైదీల హాజరు పట్టీని పరిశీలించి ఏదైనా సమస్య వస్తే జిల్లా న్యాయ సేవాధికార సంస్థను ఆశ్రయించాలని చెప్పారు. వంట గదులు, జైలు గదులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. ఆయన వెంట లీగల్ ఎయిడ్ కౌన్సిల్స్ మనోహర్, శివరాం, సులోచన, జువైనల్ జస్టిస్ బోర్డు సభ్యులు మాధవి, సునీత, జైలు అధికారులు ఉన్నారు.